క్లుప్తంగా

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు



పట్నంబజారు: సామరస్యానికి, సద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణ, దాతృత్వానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. సక్రమ మార్గంలో నడుచుకుంటూ, దేవుని యందు భక్తి, విశ్వాసాలు కలవారికి ఉత్తమమైన జీవితం ప్రసాదించబడుతుందన్న పవిత్ర ఖురాన్‌వ్యాఖ్యల్ని సదా స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని కోరారు. అదే పవిత్ర రంజాన్ మానవాళికి ఇచ్చే శుభ సందేశమన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడూ, రేపు పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023–24) గానూ ఆస్తి పన్నును ఏకమొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులకు వీలుగా శని, ఆదివారం సెలవు రోజులు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని పేర్కొన్నారు. పన్ను చెల్లింపు సమాచారం కోసం ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా హెల్ప్ డెస్క్‌ల్ని ఏర్పాటు చేశామన్నారు. పన్ను చెల్లింపుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో అదనపు క్యాష్ కౌంటర్లను, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు.

వృద్ధులు, వితంతువులకు చీరల పంపిణీ

గుంటూరు మెడికల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అల్బీనా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తాడికొండ మండలం లాం గ్రామంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యుల సహకారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేదలకు, ఇతర జిల్లాల్లోని వారికి బియ్యం, వస్త్రాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్ని ఐదేళ్లుగా నిర్విరామంగా చేస్తున్నామని నిర్వాహకులు జాలాది సెల్వరాజ్ తెలిపారు. కోవిడ్‌లో సైతం శానిటేషన్ సిబ్బందికి ఆహారం, రక్షణకు మాస్క్‌లు, శానిటైజర్లు, వస్త్రాలు అందించామని పేర్కొన్నారు. ఇటీవల విశాఖపట్నం పారా అథ్లెటిక్ గంగకు జిమ్ పరికరాలు అందిచామని చెప్పారు. కార్యక్రమంలో మేరి పాల్గొన్నారు.

ప్రకటనల బోర్డుల ఫీజుల వసూలుకు యాక్షన్ ప్లాన్

అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



నెహ్రూనగర్: నగరంలో ప్రకటనల బోర్డుల ఫీజుల బకాయిల వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఆమె శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకటనల బోర్డ్‌లకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మీడియా డివైజ్ ఫీజుల బకాయిదార్ల నుంచి ఫీజుల వసూళ్లు, చెల్లించని వారిపై చట్టపర చర్యలు తీసుకోవడానికి ఈ నెల 25న కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులకు, టీపీఎస్‌లకు లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి రోజు సమీక్ష చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబూరావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, సర్వేయర్లు సునీల్ కుమార్, హరికృష్ణ, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

నగరంలో సింగిల్ దందా

- కార్మికులు, కూలీలే టార్గెట్
- ప్రాంతాలను ఎంచుకుని నిర్వహణ
- మామూళ్ల మత్తులో పోలీసులు
- అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్న మఫ్టీ పోలీసులు
- తూతూమంత్రంగా అరెస్టులు
- అసలు వ్యక్తులను వదిలేస్తున్న వైనం





ఆన్‌లైన్‌లో సింగిల్ నంబర్ లాటరీ యాప్ చిత్రాలు

పట్నంబజారు: నగరంలో సింగిల్ నంబర్ ఆటలు జోరుగా సాగుతున్నాయి. అరికడతామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న మాటలు నీటిపై రాతలుగానే మిగిలిపోతున్నాయి. నగరంలోని ఆయా స్టేషన్ల పరిధిలో కొంతమంది అధికారులు, మఫ్టీ పార్టీ కనుసన్నల్లో యథేచ్ఛగా నడుస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా లాటరీ నిర్వాహకులు కూడా పంథాను మార్చారు. గతంలో చీటీలు రాసి ఇచ్చి..సాయంత్రానికి లాటరీ తగిలిన నంబర్లు మొత్తం ఇస్తుండేవారు. ఇప్పుడు సాంకేతికను చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా కొంత మంది ఇదే వృత్తితో కూలీలు, కార్మికులు, ఆటోవాలాల బతుకులతో ఆటలాడుతున్నారు.

కొత్త పుంతలు తొక్కుతున్న లాటరీలు

లాటరీలు కూడా కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో ఒక టికెట్టు కొంటే.. అందులో సదరు కంపెనీ ఇచ్చిన నంబర్ ఉంటే.. ఇంత మొత్తంలో నగదు వచ్చేది.ఈ క్రమంలో ఆశావహులు వేలాది రూపాయలు నష్టపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పలు ప్రాంతాల నుంచి వచ్చే లింకులు ఆధారంగా ఆటలు ఆడిస్తున్నారు. చక్కా.. మక్కా, బోడోలాండ్, సూపర్ చక్కర్, మట్కా కింగ్, సూపర్ రైడర్, ది ఫాక్స్, క్యాసినో కింగ్, గ్యాంబ్లిగ్ బాబాతో పాటు అనేక రకాల యాప్‌ల ద్వారా లాటరీ నిర్వహణ కొనసాగుతోంది. రిక్షా, తోపుడు బండ్లు, కూలీలు చేసుకునే కార్మికులు, ఆటోవాలాలు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు సైతం సులభ సంపాదన కోసం ఆశపడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. రూ. 10 కడితే రూ. 800 ఇస్తారని చెప్పి వేల రూపాయల వరకు కట్టిస్తున్నారు. ఒక్క గుంటూరు నగరం పరిధిలోనే నిత్యం రూ. 20లక్షలకు పైగా ఆన్‌లైన్‌లో ఆటలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఎక్కడో ఉండి... ఇక్కడ దందా !

సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులు మాత్రం ఎక్కడో నివసిస్తూ.. సొంత వ్యక్తులు, మేనేజర్లను పెట్టుకుని మరీ దందా సాగిస్తున్నారు. భారీ ఆటలు జరిగే ప్రాంతాలకు మాత్రం పోలీసులు వెళ్లరు. ఒక వేళ వెళ్లినా .. స్టేషన్ మఫ్టీల నుంచి ముందుగానే సమాచారం అందుతోందనే ఆరోపణలు లేకపోలేదు. ఒక వ్యాపారి కింద సుమారుగా 10 నుంచి 20 మంది వరకు మేనేజర్లు ఉంటారు. వారికి రూ. 15వేల నుంచి రూ.25వేల వరకు సీనియారిటీని బట్టి జీతాలు ఫిక్స్ చేస్తున్నారు. దీనితో పాటు మేనేజర్, నంబర్లు రాసుకునే వ్యక్తికి నిత్యం రెండుసార్లు జరిగే ప్రతి ఆటలోనూ కమిషన్ వస్తుందని సమాచారం.

గుంటూరు నగరం అడ్డా

సింగిల్ దందాకు గుంటూరు అడ్డాగా మార్చేశారు. నగరంలోని కొరిటిపాడు, శారదాకాలనీ, అరండల్‌పేట, పిచ్చుకులగుంట, అరండల్‌పేట 1వ లైను రైల్వేస్టేషన్ వద్ద, గుజ్జగుండ్ల, వెంకటప్పయ్య కాలనీ, శ్రీనివాసరావుపేట, ఆర్టీసీ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, నందివెలుగు రోడ్డు, సుద్దపల్లి డొంక, పొన్నూరు రోడ్డు, కొత్తపేట, మణిపురం బ్రిడ్జి, నాజ్ సెంటర్, నెహ్రూనగర్, పట్నంబజారు, సంగడిగుంట, ఏలూరు బజారు, నల్లచెరువు అధికంగా సింగిల్ నంబర్ లాటరీ జరుగుతోందని తెలుస్తోంది.

నెలవారీ మామూళ్ల వసూలు

సింగిల్ దందాలో అత్యంత కీ రోల్ పోషిస్తోంది మాత్రం ఆయా స్టేషన్ పరిధిలోని పలువురు అధికారులు, మఫ్టీ పార్టీ కానిస్టేబుళ్లనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండే ఒక స్టేషన్ మఫ్టీ పార్టీగా వ్యవహరించే ఒక కానిస్టేబుల్ సింగిల్ నంబర్ నిర్వాహకుల్ని స్టేషన్‌కు పిలిపించి మరీ బెదిరించినట్లు తెలుస్తోంది. ఇదే స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ నెలవారీలు తీసుకుని మరీ ఆటలు ఆడించేందుకు అనుమతులు ఇచ్చారని చెప్పుకుంటున్నారు. వస్త్ర దుకాణాలు అధికంగా ఉండే ఒక స్టేషన్ పరిధిలో కొద్ది కాలం కిందట సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుడు దొరికితే.. ఆ కేసు పక్కదోవ పట్టించి, రోడ్డుపై పేకాట ఆడుతున్నాడనే కేసులో నిందితుడిగా చూపించి లక్షలాది రూపాయాలు తీసుకున్నారని సమాచారం. అతని వద్ద పుస్తకాలు, మరిన్ని ఫోన్ నంబర్లు దొరకగా ఒక ఎస్‌ఐ కీరోల్ వ్యవహరించి ఆ కేసును మార్చి వేశారు. వెస్ట్ పరిధిలోని వాణిజ్య వ్యాపారాలు అధికంగా ఉండే స్టేషన్ పరిధిలో సదరు స్టేషన్ అధికారికి మఫ్టీ పార్టీ, ఇద్దరు కానిస్టేబుళ్లు నెలవారీ వసూళ్లు చేస్తున్నారని సమాచారం.

సమాచారం ఇవ్వండి



సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుల సమాచారం తెలిస్తే నా సెల్ నంబర్ 8688831302కు అందజేయచ్చు. ఆయా స్టేషన్ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడినా.. అక్రమాలు చేసినా.. కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, సింగిల్ నంబర్ లాటరీలు నియంత్రిస్తాం.

– కె. సుప్రజ,
అడ్మిన్, అడిషనల్ ఎస్పీ, గుంటూరు

పార్టీలకతీతంగా నగరాభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

నెహ్రూనగర్: నగరంలో కుల, మత, పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 21వ డివిజన్ కోదండరామయ్య నగర్ 2వ లైన్‌లో శుక్రవారం రూ. 50 లక్షలతో, 24వ డివిజన్ చుట్టుగుంట బాష హోటల్ పక్కన రూ. 29 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్ని కుల, మత, పార్టీలకతీతంగా అందజేస్తున్నారని, అదే బాటలో నగరాభివృద్ధి వేగంగా సాగుతుందని వివరించారు. ఇప్పటికే రూ. 150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేస్తున్నామని, వాటిలో ఇప్పటికే చాలా వరకు పూర్తి కానున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో గుంటూరుని గుంతలూరుగా మార్చారని విమర్శించారు. నగరపాలక సంస్థలో నూతన కౌన్సిల్ ఏర్పడ్డాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. గుత్తేదార్లు కూడా పనుల్ని నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని ఆయన కోరారు. రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాల్ని ఇంజినీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాంట్రకుంట గురవయ్య, అడకా పద్మావతి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ నాగవేణి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జయరాజు సాహిత్యం.. తాత్వికం, సందేశాత్మకం

మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, కవి జయరాజు, అరవింద్, సుబ్బారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: శిలా నీవే, శిల్పి నీవే, శిల్పం నీవే అంటూ సందేశాత్మక తత్వగీతంతో ఆధునిక భగవద్గీతను బోధించిన గొప్ప ప్రకృతి, తాత్విక కవి జయరాజ్ అని మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, స్టెప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అభ్యుదయ తాత్విక, ప్రకృతి కవి జయరాజ్‌తో శుక్రవారం పలువురు సాహితీ వేత్తలు, ప్రజా కవులు, అభ్యుదయ రచయితలతో బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కవి జయరాజ్ 26 తత్వగీతాలతో రచించిన 'శిలా నీవే, శిల్పి నీవే, శిల్పం నీవే' పుస్తకాన్ని మాణిక్య వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జయరాజు సాహిత్యంలో భారతీయ తత్వం, ప్రకృతి ఆరాధన, సర్వప్రాణుల సమానత్వం, మానవ జీవిత విలువలు పెనవేసుకుని ఉంటాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సోషల్ సైకాలజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న విద్యా బోధనలో విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవీయ విలువలు, సంగీతం, సాహిత్యంతో పాటు కళలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఈసందర్భంగా మండుటెండలో తనతో ఆత్మీయంగా గడిపిన రెండు వందల మంది అభిమానులకు కవి జయరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు. స్టెప్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు కార్యక్రమానికి అనుసంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసు బాబు, జన విజ్ఞాన వేదిక నాయకులు కృష్ణయ్య, ప్రజా గాయకుడు పీవీ రమణ పాల్గొన్నారు.

మార్కెట్‌పై సమగ్ర ఆలోచనతోనే వ్యాపారంలో విజయం



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ, సమగ్రమైన ఆలోచనా ధోరణితో ఉండటమే విజయానికి మూలమని హిందూ కళాశాల పాలకమండలి కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ''స్పర్ధ ది మేనేజ్‌మెంట్ ఫెస్ట్'' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మార్కెట్ పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ప్రతి విద్యార్థి గమ్యాన్ని చేరుకోవడంలో తమలోని నైపుణ్యాల్ని అంచనా వేసుకోవాలని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన ఆలోచనతో సమాజానికి ఏమి ఇవ్వగలమనే ధోరణి అలవాటు చేసుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు విద్యార్థులకు స్పర్ధ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాక్ మార్కెట్‌పై మాక్ స్టాక్ ఎక్సేంజ్, బిజినెస్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన యంగ్ మేనేజర్ అవార్డుల పోటీలో ఎంబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థిని ఎం. కీర్తి చంద్రిక, ప్రథమ సంవత్సర విద్యార్థి టి. హిమానిభిత్ విన్నర్, రన్నర్లుగా నిలిచారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పర్ధ 2023 కన్వీనర్ డాక్టర్ కె. లలిత, హెచ్‌ఓడీ వి. చక్రవర్తి, సహాయాచార్యులు యు. పద్మావతి, డి. కళ్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, బి. అనిత, ఎస్. మణికంఠ, వి. అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ప్రతిభా పురస్కార్ స్కాలర్‌షిప్స్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త శ్రీకూర్మనాథ్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాల, గుంటూరు పట్టణంలోని పెద్ద పలకలూరులోని విజ్ఞాన్ మహిళా జూనియర్ కళాశాలల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ''విజ్ఞాన్ ప్రతిభా పురస్కార్'' పేరుతో నిర్వహించే ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన వారికి ఇంటర్మీడియట్‌లో స్కాలర్‌షిప్స్ అందజేస్తామని విద్యాసంస్థల సమన్వయకర్త గుడిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా 75 శాతం నుంచి 25 శాతం వరకు ఫీజులో రాయితీను అందజేస్తామని వెల్లడించారు. వచ్చే సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశ పరీక్షలను వడ్లమూడి జూనియర్ కాలేజీ, గుంటూరు పట్టణంలోని పెద్ద పలకలూరు విజ్ఞాన్ మహిళా జూనియర్ కళాశాలలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుచికరమైన భోజనం అందించాలి

మిర్చి యార్డు చైర్మన్ సుధాకర్‌రెడ్డి



రైతులతో కలసి భోజనం చేస్తున్న సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి రైతులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి కాంట్రాక్టరును ఆదేశించారు. మార్కెట్ యార్డులో శుక్రవారం కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డితో కలసి ఉచిత భోజనశాలను ఆయన సందర్శించారు. రైతులతో కలసి స్వయంగా వారు భోజనం చేశారు. అనంతరం యార్డులో పర్యటించారు. రైతులతో మాట్లాడి సేవలు, మిర్చి ధరల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్ షాపుల ముందు మిర్చి బస్తాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. ఎగుమతి వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చి బస్తాలను అదే రోజు బయటకు తరలించాలని చెప్పారు. ప్రతి దిగుమతి షాపు వద్ద డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు మంచి ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఆయన వెంట యార్డు ఇన్‌చార్జి కె.శివారెడ్డి తదితరులున్నారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నుమా, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ కర్నుమా, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు. నగరపాలెంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కర్నుమా మాట్లాడుతూ రంజాన్‌ను సందర్భంగా నగరంలోని నగరంపాలెం ఈద్గా, పాత బస్టాండ్‌లోని మొహమ్మదీయన్ పాఠశాల, ఆంధ్రా ముస్లిం కళాశాల ఆవరణలో ముస్లింలు ప్రార్థనలు చేస్తారని తెలిపారు. ఈ మూడు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. వారి సంక్షేమం కోసం పల పథకాల్ని తీసుకువచ్చారని తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఈద్గాల వద్ద ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు మెహమూద్, ఖాజామొహీద్దీన్ చిష్టి, అబీద్‌బాషా, మీరావలి, అంజుమన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముస్తఫా రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పండుగను పురస్కరించుకుని నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ, కఠిన నియమాలతో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మేయర్ శుభాకాంక్షలు

నెహ్రూనగర్: ముస్లింలకు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. అల్లా కరుణతో అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పండ్లు పంపిణీ



గుంటూరు మెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగంలో బాలింతలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. తల్లిపాల ప్రాధాన్యత గురించి, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బాలింతలకు కలిగే ప్రయోజనాల గురించి క్లబ్ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు విమల కుమారి, కార్యదర్శి పద్మజ, డైరెక్టర్లు ఆదిశేష, అప్పారావు, డాక్టర్ శ్రావణ్, అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, ఫార్మాసిస్టుల సంఘం నాయకురాలు రాధారాణి పాల్గొన్నారు.

30 నుంచి శ్రీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న నగేష్

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 30 నుంచి ఐదు రోజుల పాటు జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి నగేష్ కుమార్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30న ఉదయం హోమాలు, అభిషేకాలు, కలశాలతో ఊరేగింపు, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు కుంకుమ పూజలు, అలంకార పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. టి.ఎల్.వి.వీరాంజనేయులు మాట్లాడుతూ అమ్మవారి జయంతి పురస్కరించుకుని భక్తులందరూ తమ ఇళ్లవద్ద బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఈఓ దుర్గారావు, మొగిలి సతీష్‌కుమార్, కొల్లిపర వెంకటేశ్వరరావు, భవిరిశెట్టి శ్రీనివాసరావు, జుజ్జూరు శివకుమార్, ప్రమీలారాణి పాల్గొన్నారు.

భావి ఉపాధ్యాయులు సమాజాన్ని తీర్చిదిద్దాలి



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనే ఆశయంతో విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులు సమాజాన్ని తీర్చిదిద్దాలని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సూచించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో శుక్రవారం 2021-23 బీఈడీ బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులంతా కాబోయే ఉపాధ్యాయులుగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మోటూరి రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత, నృత్య పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ మహంకాళి సూర్యనారాయణశర్మ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రేష్మిత, ఆర్. వైష్ణవి, జి. వైష్ణవి, లిఖిత, అక్షయ, భువన, సీహెచ్. తేజస్వి కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఊటుకూరి నాగేశ్వరరావు, డాక్టర్ కె. సూర్యనారాయణ, డాక్టర్ ఎస్. సత్యనారాయణ, పి.ఎస్.ఆర్ మూర్తి, డాక్టర్ ఎమ్.ఎస్. శ్రీధర్ పాల్గొన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



చిన్నారులతో కృష్ణప్రసాద్, రఢిని చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం యూకేజీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకత, నైపుణ్యాల్ని వెలికితీసేందుకు ఇటు వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. పిల్లల్ని ప్రతిభా పాటవ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థిని షాలిని ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకు చకచకా సమాధానాలు చెప్పి అందరినీ ఆకర్షించింది. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రఢినీ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.